రేషన్‌లో 'కంది'పోయింది

- ఆగిన కేటాయింపులు - లబ్ధిదారులకు చేరని కందిపప్పు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల్లో రోజు రోజుకూ కోత పడుతోంది. ఇచ్చే సరుకుల్లో తాజాగా కందిపప్పు ఆగిపోయింది. కేటాయింపులు ఆగిపోవడంతో లబ్ధిదారులకు కందిపప్పు చేరడం లేదు...

కర్నూలు జిల్లాలో 1,233 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 409 ఎండియు వాహనాల ద్వారా 6,62,083 మందికి రేషన్ సరుకులు అందిస్తున్నారు. జూన్, జులై నెలలకు కలిపి కార్డుదారులకు ఆగస్టులో కందిపప్పు సరఫరా చేస్తామన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మాటలు నీటి మూటలయ్యాయి. ఆగస్టులో అందలేదు. సెప్టెంబరులో కేటాయింపులు జరగలేదు. పౌరసరఫరాల గోదాముల్లో కిలో కంది పప్పు కూడా నిల్వ లేదు. మొన్న టమాటా ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. తాజాగా కందిపప్పు ధరలకు రెక్కలొచ్చాయి. కిలో కందిపప్పు దాదాపు రూ.200 చేరువలో ఉంది. సామాన్యుడికి పప్పన్నం భారంగా మారింది. చౌక దుకాణాలు, ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్నా నాలుగు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదని పేద, మధ్య తరగతి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు కార్డుదారులకు కందిపప్పు పంపిణీ ఆగిపోయింది. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర భగ్గుమంటోంది. గత మూడు నెలలుగా వచ్చే నెల ఇస్తామని చెబుతూ తప్పించుకుంటున్నారు. సెప్టెంబరులోనూ చేతులెత్తేయడంతో బియ్యంతో ఎలా సరిపెట్టుకోవాలని కార్డుదారులు ఎండియు వాహనదారులపై

మండిపడుతున్నారు. కందిపప్పు ఇవ్వకపోతే మా వీధికి రేషన్ బండి తీసుకురావొద్దని కొన్నిచోట్ల స్పష్టం చేస్తున్నారు. బయట మార్కెట్లో కిలో కంది పప్పు రూ.160-180కు పైగా ఉంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా గతంలో కందిపప్పు కిలో రూ.67కే ఇచ్చేవారు. ప్రస్తుతం సరఫరా లేక పోవడంతో రెండింతలు అదనపు భారం పడుతోంది. తక్కువ ధరకే నిత్యావసరాలు రైతుబజార్ల ద్వారా వినియోగదారులకు అందిస్తున్నామని, ఇందులో భాగంగా రైస్ మిల్లర్లు, ట్రేడర్ల ఆధ్వర్యంలో రైతుబజార్లలో కౌంటర్లు ఏర్పాటు చేయించామని, కిలో కందిపప్పు రూ. 140కే అమ్మకం చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. నగరంలో సి. క్యాంపు రైతుబజారు, కొత్త పేట, ఆదోనిలో కందిపప్పు కిలో రూ. 140కు విక్రయిస్తున్నట్లు పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. జులై 17 నుంచి రైతుబజార్లలో కౌంటర్లు ప్రారంభించగా 45 రోజుల వ్యవధిలో 3 క్వింటాళ్ల కందిపప్పు అమ్మారంటే నాణ్యత ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. ఆగస్టు 27 నుంచి కర్నూలు నగరంలోని సి. క్యాంపు రైతు బజారులో నిల్వలు నిండుకున్నాయి. బహిరంగ మార్కెట్‌లో రెండో రకం కందిపప్పు కిలో రూ.160 కుపైగా ఉండగా రైతు బజారులో రూ.140కు అమ్మేందుకు వ్యాపారులు ససేమిరా అంటున్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చర్యలు

- ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఇన్‌ఛార్జీ కలెక్టర్ మౌర్య, అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చిన్న పిల్లలకు 0-5 సంవత్సరాల లోపు వారికి వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు 5.0 కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష నిర్వహించారు. ఇంఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు వేసుకోని 0-5 సంవత్సరాల లోపు పిల్లలను , గర్భిణీలను గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేయించడమే జాతీయ 'ఆరోగ్య మిషన్' ఇంద్రధనస్సు 5.0 కార్యక్రమం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఆగస్టు 7 నుంచి 12 వరకు మొదటి విడతలో ఉధృత మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా రొటీన్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రెండో విడతగా, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు,మూడో విడతగాఅక్టోబర్ 9 నుంచి 14 వరకు మొత్తం మూడు విడతలో ఉధృత మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా రొటీన్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ రామ గిడ్డయ్య, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పిడి వెంకట లక్ష్మమ్మ, సర్వజన ప్రభుత్వ వైద్యశాల డిసిహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, డెమో ప్రమీల దేవి పాల్గొన్నారు.

డిఆర్‌ఒగా మధుసూదన్ రావు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లా రెవెన్యూ అధికారిగా కె.మధుసూదన్ రావును నియమితులయ్యారు. ప్రస్తుతం డిఆర్‌ఒగా పనిచేస్తున్న నాగేశ్వరరావును బదిలీ చేసి ఆయనను నేరుగా జిఎడిలో రిపోర్ట్ చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రస్తుతం డిఆర్‌ఒగా వస్తున్న మధుసూదన్ రావు అనంతపురం జిల్లాలో హెచ్‌పిసిఎల్ డిప్యూటీ కలెక్టర్ పనిచేస్తున్నారు. డిఆర్‌ఒ నాగేశ్వరరావు బదిలీపై వెళ్తున్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ కొనసాగుతుంది. ఆయన బదిలీపై ఓ జిల్లా ఉన్నతాధికారి హస్తం ఉన్నట్లు చర్చ జరుగుతుంది.

ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సిఎంఒ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య , ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కృష్ణబాబు అన్నారు. బుధవారం వారు అమరావతి నుండి జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇన్చార్జి కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య , డిఎంహెచ్‌ఒ రామ గిడ్డయ్య , డిపిఒ నాగరాజు నాయుడు, సోషల్ వెల్ఫేర్ డిడి శ్రీనివాసులు , బిసివెల్ఫేర్‌డిడి వెంకటలక్ష్మి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను వారు కోరారు. మండలాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో జరిగే కార్యక్రమం పై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

ఖరీఫ్ సాగు గట్టెక్కేనా..?

- రైతు ఆశించిన స్థాయిలో కురవని వర్షం
- గతేడాదితో పోలిస్తే పత్తి వేరుశనగ తగ్గిన సాగు
- వర్షాభావ పరిస్థితులు నెలకొంటే తప్పని కరువు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

వ్యవసాయం సాయం కోరుతుందా ? సహాయం చేస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సాగు మొదటి నుండి అందోళన లోనే కొనసాగుతోంది. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడమే ఇందుకు ప్రధాన కారణంగా ఉందని రైతులు తెలుపుతున్నారు. వ్యవసాయం ఖరీఫ్‌లో విస్తరంగా వర్షాలు కురిసి సాగు జరిగితే అన్నదాతలు ఆశించిన స్థాయిలో సాగు చేసేవారు. కానీ ఈ ఏడాది వ్యవసాయం కుంటుపడుతుందనే అనుమానాలు రైతుల్లో మొదలయ్యాయి. ఈ ఖరీఫ్ సాగు గట్టెక్కేనా ? అని రైతులు ఆలోచిస్తున్నారు. ఈనెల 3,5 తేదీల్లో రెండురోజుల పాటు కురిసిన వర్షం ఎండుముఖం పట్టిన పంటలకు కొంత ఉపశమనం కలిగించినా గత వర్షానికి ఈ వర్షానికి ఎక్కువ రోజులు దాదాపు 45 రోజులు ఉండటంతో అక్కడక్కపంటలు ఎండుముఖం ట్టాయి. పత్తిలాంటి చేలు వర్షం లేక ఎదుగుదల లేకపోవడం, ఎర్ర తెగులు రావడం గమనించాం. వాటన్నింటినీ అధిగమించి పంటచేతికి వస్తుందో లేదో తెలిమరు.

గతేడాదితో పోలిస్తే తగ్గిన సాగు: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు 4,21,548 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తారని అంచనా వేస్తే వర్షాభావ పరిస్థితుల వల్ల 3,23,878 హెక్టార్లలో సాగు చేశారు. 76 శాతం సాగు చేశారని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. గతేడాది 3,51,663 హెక్టార్లలో ఖరీఫ్ సాగు జరిగింది. ఈ ఏడాది పత్తి 1,85,602 హెక్టార్లలో సాగు జరిగింది. గతేడాది 253511 హెక్టార్లలో సాగు జరిగింది, వేరుశనగ 46173 హెక్టార్లు, మిరప 28013 హెక్టార్లు, ఉల్లి 11557 హెక్టార్లు సాగు చేశారు. ఎల్లెల్సీ.. తుంగభద్ర నది నుంచి ఎత్తిపోతల ద్వారా 6,604 హెక్టార్లలో వరి పంటలు వేశారు. ఆగస్టులో జిల్లాలో 80 శాతం లోటు వర్షపాతం నమోదైంది. సెప్టెంబరులో వర్షాలు పడితే కొంతైనా గట్టెక్కుతామని, ఆశించిన రైతులకు నిరాశే మిగిలేలా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నల్లరేగడి నేలల్లో పత్తి సాగు చేసిన రైతులు ఆశిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పైరకు అవసరమైన నత్రజని అందించే యూరియా వాడకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు అంటున్నారు.

ఆశించిన స్థాయిలో కురవని వర్షం: రాష్టంలోనే అత్యల్పంగా వర్షపాతం నమోదు అయిన జిల్లా కర్నూలు మాత్రమే .నైరుతి ఆలస్యం వల్లే రైతాంగం కుదేలయింది. జూన్ మాసంలో గతేడాది విస్తారంగా వర్షాలు కురిశాయి. ఏడాది సాధారణ వర్షపాతం 77.7 మిల్లీమీటర్లు కురిసింది.46.9 దాదాపు 40 శాతం లోటు వర్షపాతం నమోదయింది. సులై 64 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఆగస్టులో 29.3 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. అంటే 75 శాతం లోటు వర్షపాతం నమోదవడంతో సాగు చేసిన పంటలు సైతం వాడుముకం పట్టాయి. కొన్ని మండలాల్లో పంటలు ఎండిపోయాయి. నైరుతి రుతుపవనాలు ఆలస్యం వల్ల వ్యవసాయ అధికారులు సూచన వల్ల ఖరీఫ్ సాగు ఆలస్యంగా జరిగింది. ఆగస్టులో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సెప్టెంబర్‌లో మొదట్లోనే గత 3 రోజులుగా తుఫాను కారణంగా వర్షాలు భారీగా కురుస్తాయని ఆశించిన ఆశలు నిరాశగా మిగిలాయని రైతులు తెలుపుతున్నారు. మూడు రోజులుగా వర్షాలు కురిసినా ఎక్కడ కూడా భారీగా వరద నీరు చేరలేదు. శ్రీశైలం నీటిమట్టం 855 అడుగులకు గాను 850 అడుగులు ఉంది. కనీసం 5 అడుగుల వరద నీరు కూడా చేరలేదు. సుంకేసులకు అనుకున్న స్థాయిలో వరద నీరు చేరలేదు. తుంగభద్ర పరివాహక ప్రాంతం గతేడాది ఈ సమయానికి పొంగిపొర్లాయి. ఈ ఏడాది కనీసం 200 టీఎంసీల నీరు కూడా చేరకపోవడం రైతాంగం ఆదోళన వ్యక్తం చేస్తుంది.

వర్షాభావ పరిస్థితులు నెలకొంటే కరువు తప్పదా ? : ఆగస్టులో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈనెలలోఅనుకున్న స్థాయిలో వర్షం కురవకపోతే ఖరీఫ్ సాగు కరువు తప్పదంటున్నారు. రైతులు. అసలే సాగు ఆలస్యం అవడం తీవ్ర వర్షాభావ పరిస్థితులు వెంటాడటం ,పంటలు అన్ని కూడా మొలక దశలోనే ఉన్నాయి. ఎర్ర నెలల్లో వేసిన పత్తి ఇప్పటికే వాడుముకం పట్టింది. వేరుశనగ మొలకలు సరిగా రాలేదు. బోర్లకింద వేసిన పంటలు తప్ప వర్షాధార పంటలు ఎక్కడ కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడం తీవ్ర నష్టాన్ని మిగులుస్తుందేమో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవకపోతే కరువు తప్పదని రైతులు తెలుపుతున్నారు.

ఆశించినంత వర్షం కురవలేదు పత్తి పెరగలేదు

- వెంకట రాముడు, రైతు, సి.బెళగల్

గతేడాదికంటే చాలా తక్కువ వర్షం కురిసింది.వర్షాభావ పరిస్తితులవల్ల 8 ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా ఎండిపోయి తీసేశాను. 6 ఎకరాల్లో కంది సాగు చేశాను. వర్షం లేనందున పంటలు వాడు ముఖం పట్టాయి. చేతికి వస్తాయో లేదో అనే భయంలో ఉన్నాం. ప్రస్తుత పత్తి పంట కూడా వర్షం సరిగా లేకపోవడం వల్ల సరిగా పెరగలేదు. రైతులకు ఈ ఏడాది నష్టాలు వచ్చేలా ఉంది. ఆశించిన స్థాయిలో వర్షం కురవలేదు. ఈ మాసంలో అయిన వర్షాలు కురిస్తే బాగుంటుంది.

సరిగా పెరగని పత్తి పంట చూపుతున్న రైతు వెంకట రాముడు

సమావేశంలో మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి

9న చెన్నమ్మ సర్కిల్‌లో చంద్రబాబు బహిరంగ సభ

జయప్రదానికి గౌరు దంపతుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9న సాయంత్రం 5:00గంటలకు కల్లూరు చెన్నమ్మ సర్కిల్ లో జరిగే 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం లో పాల్గొంటారని టిడిపి పాణ్యం ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత , నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి తెలిపారు. గౌరు చరిత ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బుధవారం గౌరు దంపతుల స్వగహం మాధవి నగర్ లో ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కల్లూరు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం, మండలాలు, కల్లూరు అర్బన్ పరిధిలో ఉన్న 16 వార్డుల ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు టిడిపి అభిమానులు, గౌరు అభిమానులు, ప్రతి ఒక్కరూ భారీ సంఖ్యలో తరలి వచ్చి ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. పాణ్యం నియోజకవర్గ అబ్జర్వర్ కదిరి మాజీ ఎమ్మెల్యే చాంద్ బాషా, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ ఎన్‌వి రామకృష్ణ, నాయకులు నన్నూరు విశ్వేశ్వర రెడ్డి, ఓర్వకల్లు పాణ్యం మండల అధ్యక్షులు జయరామిరెడ్డి, గోవింద్ రెడ్డి, అర్బన్ వార్డ్ ఇంచార్జులు ముఖ్య నాయకులు కార్యకర్తలు టిడిపి అభిమానులు పాల్గొన్నారు.

9న జిల్లా స్కేటింగ్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

స్కేటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

కర్నూలు జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలను నిర్వహిస్తున్నారని జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం కార్యదర్శి బైరెడ్డి పక్కిరెడ్డి, ఉపాధ్యక్షులు పి.సునీల్ కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్కేటింగ్ ఎంపిక పోటీలను 9న శనివారం ఉదయం 8 గం కర్నూలు జిల్లా ఔట్ డోర్ స్టేడియంలోని స్కేటింగ్ రింక్ లో నిర్వహిస్తారని తెలిపారు. ఆన్‌లైన్ క్వాడ్ స్కేటింగ్ క్రీడంశలలో పోటీని రింక్ రేస్ , రోడ్‌రేస్ , లలో నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల స్కేటింగ్ క్రీడాకారులు ప్రవేశరుసుం , వయస్సు ధృవీకరణ పత్రంలో పేర్లు నమోదు చేసుకొని పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు మొబైల్ నెంబర్ 9010501082 ను సంపాదించలని కోరారు , ఎంపికైన వారు జిల్లా స్థాయి పోటీలకు అర్హత పొందుతారని వారు వివరించారు.

పార్లమెంటులో ఎబిసిడిల బిల్లు పెట్టాలి

ఎంఆర్‌పిఎస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు

ప్రజాశక్తి -కోడుమూరు

ఎంఆర్‌పిఎస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రయ్య

ప్రస్తుత పార్లమెంటు సమావేశంలో ఎస్‌సిల ఎబిసిడిల వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలతో కోడుమూరులో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు సూచించారు. ఎబిసిడి వర్గీకరణ శీతకాల సమావేశాలలో పార్లమెంటులో ప్రవేశ పెట్టాలని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ నెల 9 నుండి 22వరకు జరిగే దీక్షలకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలన్నారు. ఈరోజు ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు నగేష్ అధ్యక్షతన కోడుమూరులోని అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య మాట్లాడుతూ 1994 నుండి మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎబిసిడి వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటం చేస్తున్నారని అన్నారు. ఎబిసిడి వర్గీకరణ వలన మాల, మాదిగ, 59 ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ, ఉద్యోగంలో సమాన హక్కులు కలుగుతుందని అన్నారు. ఎంఆర్‌పిఎస్ ఒక ప్రక్క ఎబిసిడి వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలతో పోరాడుతూనే, మరో పక్క సామాజిక సేవలు అందిస్తున్నదని అన్నారు. ఉదాహరణగా ఆరోగ్య శ్రీ పథకం దండోరా ఉద్యమ ఫలితమే అన్నారు. టిడిపి రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి, సిబి. లత ,వైసిపి నాయకులు అద్దుగల రాజశేఖర్, సిపిఎం డివిజన్ కార్యదర్శి గఫుర్‌మియ్యా, సిపిఐ డివిజన్ కార్యదర్శి రాజు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ చేసే ఉద్యమం జాతీయ స్థాయిలో ఉందని, వారి డిమాండ్ నెరవేరాలనంటే బిజెపి ప్రభుత్వం ఈ శీతకాల సమావేశంలో ఎబిసిడి వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. దండోరా చేసే ఉద్యమాన్ని అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు, కట్టెల రాజు, మనోహర్, ప్రసాద్, వార్డు మెంబర్లు నరేంద్ర, ప్రతాప్ రెడ్డి, సిఐటియు నాయకులు ఈరన్న, ఆటో యూనియన్ నాయకులు మధు, రంగస్వామి, బాష, టిడిపి నాయకులు రవి గౌడ్, ఎల్లప్ప నాయుడు, వైసిపి నాయకులు బలరాముడు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి సీనియర్ నాయకుడు ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-సి బెళగల్

వైసిపి మండల సీనియర్ నాయకులు సి బెళగల్ కు చెందిన శ్రీనివాసులు గౌడ్ (62)బుధవారం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందారు. తమ్ముడు ఈరన్న గౌడ్ ఎంపిటిసి గెలుపునకు గతంలో మరో తమ్ముడు మండల కన్వీనర్ కోసం, మండలంలో క్రియాశీలకంగా రాజకీయంలో ఉన్నారని ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

9నుంచి ఐసిఇయు ట్రేడ్ యూనియన్ శిక్షణ

ఎల్ఐసి జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు సునియ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఐసిఇయు ప్రతిష్టాత్మకంగా నిర్వహించు ట్రేడ్ యూనియన్ క్లాసులకు కర్నూలు జిల్లా వ్యాప్త ఎల్ఐసిలోని ఉద్యోగుల సంఘం యూనియన్ సభ్యులు ఈనెల 9న హాజరు కావాలన్నారు. ఈ క్లాసులకు ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పి.సతీష్ , జోనల్ సంయుక్త కార్యదర్శి జి. తిరుపతయ్య , ఎ. రఘునాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి కడప డివిజన్ కర్నూలుకు రానున్నారని రాయలసీమ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు ఆర్ సునీల్ కుమార్ , డివిజనల్ సంయుక్త కార్యదర్శి పి రమేష్‌ల ఆధ్వర్యంలో కర్నూలులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం యూనియన్ శిక్షణ తరగతులు ఈనెల 9 శనివారం రోజున కర్నూలు జిల్లా పరిషత్ హాలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీమా రంగం జాతీయాకరణ జరగక ముందే ఈ యొక్క యూనియన్ ఆవిష్కరణ చెంది భారతదేశంలోని బీమారంగాన్ని జాతీయాకరణ చేయడంలో ప్రముఖ పాత్ర నిర్వహించి భారతదేశంలోని ప్రతి ఒక్క పౌరునికి , మారుమూరు ప్రాంతంలో ఉన్నవారికి ప్రతి పౌరునికి ఇన్సూరెన్స్ అందించాలని లక్ష్యంగా ఈ యూనియన్ ఆవిర్భావం చెందిందన్నారు. ఈనెల మొదటి వారంలో ఇన్సూరెన్స్ వారోత్సవాలు జరుపుకొని, మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పాలసీదారులకు, కస్టమర్లకు మరింత ఉన్నత స్థాయి సాంకేతిక సేవలను మెరుగైన లాభాలను అందించే అంశాల్ని చర్చిస్తామని అన్నారు. భారత దేశంలో ఇన్సూరెన్స్‌ను కాపాడడమే కాకుండా, సంస్థ మనుగడను కూడా కాపాడుకుంటూ, తమ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాన్ని శిక్షణా తరగతుల్లో నిర్ణయిస్తామని అన్నారు. ఈ క్లాసులను బోధించడానికి తమ సంఘం జాతీయ నాయకులు హాజరు అవుతున్నారని ఎంతో ఉపయుక్తమైన ఈ క్లాసులకు జిల్లాలోని ఇన్సూరెన్స్ సిబ్బంది సంపూర్ణంగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఓరియెంటేషన్ డేలో మాట్లాడుతున్న డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి

క్రమశిక్షణ పట్టుదలతో చదువు పూర్తి చేయాలి

ఓరియెంటర్ డేలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కె వి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో తాము ఎంచుకున్న సబ్జెక్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచి లక్ష్యాన్ని చేరుకోవాలని డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ డాక్టర్ పివి.సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం నగర శివారులోని డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి ఇంజనీరింగు మొదటి సంవత్సరంలో చేరిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. డాక్టర్ కెవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉంటు 90 శాతం అటెండెన్స్ కల్గి ఉండాలని తెలిపారు. కష్టపడి చదవాలని, మీ తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని నూతన విద్యార్థులకు చెప్పారు. ర్యాగింగ్ లేని కళాశాలగా మన కళాశాల రూపు దిద్దుకోవడం మనకు గర్వకారణం అన్నారు. కళాశాల కరెస్పాండెంట్ ఎస్.విజయ లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడితే కానీ విజయం చేరుకోలేమన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ కష్టపడి కాలాన్ని వధా చేసుకోకుండా చదవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్‌జె. కన్నా కుమార్ వైస్ ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి ప్రొఫెసర్స్, ఫ్యాకల్టీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రవీంద్ర గ్లోబల్ స్కూల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రవీంద్రగ్లోబల్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

కర్నూలు నగర శివారులలోని రవీంద్ర గ్లోబల్ స్కూల్లో ఈరోజు శ్రీకృష్ణ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో అమ్మాయిలు అందరూ గోపికా వేషదారణతో, అబ్బాయిలు అందరూ శ్రీకృష్ణుడి వేషధారణతో పాఠశాలకు వచ్చారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చక్కగా విద్యార్థులు ఆనంద ఉత్సాహాలతో, కేరింతల మధ్యలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య మాట్లాడుతూ మన సాంప్రదాయాలను ఎప్పటికీ మర్చిపోకుండా చూడాలన్నారు. మనభాష, మనవేషం, మన కళలు అన్నవి మన భారతీయ సంస్కృతికి కంచుకోటల్లా నిలవాలని తెలుపుతూ పండుగ ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జి.వంశీధర్ , ఉపాధ్యాయులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల కోసం
రైతులకు అన్యాయం చేస్తారా..?
- జగన్ ఓ స్టంట్ మాస్టర్ - టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల

ప్రజాశక్తి - గోనెగండ్ల

మాట్లాడుతున్న కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి

గాజులదిన్నె ప్రాజెక్టు పనులు చేసే కాంట్రాక్టర్ కోసం నీటిని వృథాగా వదిలి రైతులకు అన్యాయం చేస్తారా అని కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం గోనెగండ్లోని గాజులదిన్నె ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఓ స్టంట్ మాస్టర్ అని తెలిపారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రపై రాళ్లు వేయించడం, పాత కేసులు తిరగతోడుతున్నారని చెప్పారు. టిడిపి నాయకులు, కార్యకర్తలపై అనవసర కేసులు నమోదు చేయించడంలాంటి జిమ్మిక్కు, స్టంటులతో టిడిపి శ్రేణులను భయాందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టు మరమ్మతు పనులను వేసవిలో చేపట్టకుండా, పంటలు సాగు చేసుకునే కాలంలో చేపట్టి డ్యాంలో నిల్వ ఉన్న అరకొర నీరు వృథాగా హంద్రీలోకి వదిలి రైతుల పొట్ట కొడతారా అని జిడిపి అధికారులను ప్రశ్నించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో డ్యాంలో ఉన్న నీటిని వృథాగా వదిలి ఖాళీ చేస్తే రానున్న రబీ సీజన్‌కు రైతులు పంటలు ఎలా సాగు చేసుకోవాలని నిలదీశారు. డ్యాంపై ఆధారపడి ఉండే తాగునీటి పథకాల పరిస్థితి ఏమిటని, దానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. జిల్లాలో తాగు, సాగునీటికి ఎంతో ప్రాముఖ్యత ఉన్న గుండ్రేవుల, వేదవది ప్రాజెక్టులను అభివృద్ధి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సర్పంచి భాగ్యరత్న, సిబి.లత, పెద్దనేలటూరు పరమేశ్వరరెడ్డి, అలువాల సర్పంచి బాష, అక్బర్ బాషా, బాబు నాయుడు, రంగూన్ బాష, చెన్నల రాయుడు, కౌలుట్ల నాయుడు, ఎస్‌బి.యూనుస్, పెద్ద లక్ష్మన్న, దరగల మాబు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంకు రుణ పరిమితి
రూ.10 లక్షలకు పెంచేందుకు కృషి
- ఎటిఎం సేవలందిస్తాం - టౌన్ బ్యాంకు 78వ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పాలకమండలి, నాయకులు

'ది ఎమ్మిగనూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు'లో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైసిపి నేత ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి సహకారంతో ప్రస్తుతం ఇస్తున్న రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణ పరిమితిని పెంచేందుకు ప్రభుత్వానికి ప్రదిపాదనలు పంపినట్లు టౌన్ బ్యాంకు ఛైర్మన్ కొమ్ము రాజశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక టౌన్ బ్యాంకులో 78వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టౌన్ బ్యాంకు అభివృద్ధి పథంలో నడుస్తోందని తెలిపారు. 2019లో డిపాజిట్లు రూ.18 కోట్లు ఉండగా 2023లో రూ.29 కోట్లకు పెరిగాయని చెప్పారు. 2022-23కు రూ.42.72 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అలాగే ఎటిఎం సేవలతో పాటు బ్యాంకు వెబ్ సైట్, ఇన్స్యూరెన్స్ సేవలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, కో ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ నాగరాజు, వైసిపి నాయకులు బుట్టా రంగయ్య, రియాజ్ అహ్మద్, వహాబ్, షాబుద్దీన్, డైరెక్టర్లు తట్టే బుడ్డప్ప, చాంద్, వడ్డే రంగన్న, రాజశేఖర్, శ్రీరాములు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా జంబులింగయ్య

ప్రజాశక్తి-ఆలూరు

అవార్డు అందుకుంటున్న జంబులింగయ్య

క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనతో విధుల పట్ల అంకితభావం కలిగి సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఆలూరు 4వ వార్డులో పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.జంబులింగయ్య ఎంపికయ్యారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కర్నూలు జడ్‌పి సమావేశ భవనంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. జంబులింగయ్యకు ప్రశంసాపత్రం, అవార్డును డిఇఒ రంగారెడ్డి, సర్వశిక్ష అభియాన్ పిఒ వేణుగోపాల్ చేతుల మీదుగా అందజేశారు. బుధవారం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, బంధుమిత్రులు అభినందించారు.

ఉరేసుకొని కానిస్టేబుల్ ఆత్మహత్య

ఆదోని : ఉరేసుకొని కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదోనిలోని శ్రీనగర్ కాలనీలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసుల వివరాల మేరకు... ఆదోని డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సందీప్ కుమార్ 2వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆర్‌టిసి కాలనీలో నివాసం ఉంటు న్నారు. రాత్రి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. సందీప్ కుమార్‌కు భార్య హేమలత, కుమార్తె ఉన్నారు.

రోడ్లు గుంతలమయం...

- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

ఇప్పటికే శిథిలావస్థలో ఉన్న ఆదోని రోడ్లు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా మరింత శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆదోని శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరి అధ్వానంగా ఉంది. ఆదోని నడిరోడ్డులోని రోడ్లు సైతం గుంతలు పడి కనీసం నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంది.

పట్టణంలోని ఏ వీధికి వెళ్లినా గుంతలు పడిన రోడ్డులో వర్షపు నీరు చేరింది. అసలు రోడ్డు ఎక్కడ ఉందో, గుంత ఎక్కడ ఉందో అర్థం కాని పరిస్థితిలో పాదాచారులతోపాటు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులైతే నిత్యం ప్రతి రోడ్డులోనూ గుంతల కారణంగా గాయాలకు గురవుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలు మంత్రాలయం రాఘవేంద్ర స్వామి, ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంతోపాటు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు, శిరుగుప్ప ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల నుంచి ఆదోని పట్టణంలోకి ప్రవేశించే ప్రజలకు కొత్త బ్రిడ్జి జీరో పాయింట్ దగ్గర, అంతకుముందు రాయమిల్లు టర్నింగ్ నుంచి పాత ఆర్‌టిఒ కార్యాలయం వరకు రోడ్లు మొత్తం గుంతలు పడి ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా నెలరోజుల పాటు జరిగే పూజలకు వేలాది సంఖ్యలో భక్తులు ఆదోని నుంచి తరలి వెళ్లేందుకు ఉన్న ఏకైక మార్గం ఇదే. ఈ మార్గంలోని రోడ్లు గుంతలమయం కావడంతో కొత్త బ్రిడ్జి జీరో పాయింట్ నుంచి రాయ మిల్లు టర్నింగ్ వరకు అనేక ప్రమాదాలు జరిగాయని అక్కడ ఉన్న వ్యాపారులు, ప్రజలు వివరించారు. అలాగే పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం నుంచి ఈఎస్‌ఐ ఆస్పత్రి రైల్వే గేట్ వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు ఎక్కువ రోజులు నిలుస్తుండడంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించేవారు కిందపడి ప్రమాదాలు బారిన పడ్డ సందర్భాలు ఉన్నాయి. రోడ్లు వేయాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నా తమ పరిధిలోకి రాదని ఆర్‌అండ్‌బి అధికారుల పేరు చెప్పి తప్పించుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఖాజీపుర, నిజాముద్దీన్ కాలనీ, వాల్మీకి నగర్, హనుమాన్ నగర్, పెద్ద శక్తి గుడి, ఎన్‌టిఆర్ నగర్, మైనార్టీ కాలనీతో పాటు ఇతర కాలనీలకు వెళ్లేందుకు ఉన్న ఖాజీపుర రోడ్డు ఖాజిసాబు కార్యాలయం హవేలీ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్లు గుంతలు పడి వర్షపు నీరు నిలిచింది. ఇక ఎమ్మిగనూరు రోడ్డులోని రిలయన్స్ పక్కనే ఉన్న ఎన్‌జిఒస్ కాలనీ ఎల్‌ఐజిఎంఐజి టెలికం కాలనీ, అరుణ్ జ్యోతి నగర్‌కు వెళ్లే దారిలో కూడా అనేక గుంతలు దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డుకు ప్రారంభంలోనే రిలయన్స్ పక్కనే ఉన్న రోడ్డులో గత ఆరు నెలల క్రితమే గుంతలు పూడ్చినా తిరిగి గుంతలు ఏర్పడ్డాయి. జనం రద్దీతో ఉండే మున్సిపల్ మెయిన్ రోడ్డు, పిఎన్ రోడ్డు పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. బిఎన్ టాకీస్, ప్రభాకర్ టాకీస్ ప్రాంతంలోనూ రోడ్లు గుంతలు పడ్డాయి. గతేడాది పట్టణంలో ఉన్న గుంతలను ప్యాచ్ వర్క్ వేయడానికి మున్సిపల్ అధికారులు సుమారు 1500 గుంతలను గుర్తించి రూ.35 లక్షలు ఖర్చు చేసి వేసిన పూతలు ఎక్కడ ఉన్నాయో కనబడడం లేదు. మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని పాత బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడి పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. కొత్త బ్రిడ్జికి కూడా అప్పుడే గుంతలు పడుతున్నాయి. బ్రిడ్జిపై గుంతలు పడి ఐరన్ కడ్డీలు బయట కనిపిస్తున్నాయి. కనీసం ఈ కొత్త బ్రిడ్జికైనా మరమ్మతులు చేపట్టి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

అధ్వానంగా ఈఎస్‌ఐ రైల్వే గేటు రోడ్డు

ఆదోని ఈఎస్‌ఐ రైల్వే గేట్ నుంచి గూడ్ షెడ్డుకు వెళ్లే రోడ్డు మరి అధ్వానంగా ఉంది. గూడ్ షెడ్ ద్వారా లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్నా రైల్వే అధికారులు కనీసం రోడ్డుకు పడిన గుంతలు కూడా పూడ్చలేని పరిస్థితిలో ఉన్నట్లు స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఫర్టిలైజర్ ఎరువులు, బియ్యం, ఇతర సరుకులు పట్టణంలోకి లారీల ద్వారా ఇక్కడ నుంచే రవాణా చేస్తున్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో లోడుతో వెళ్తున్న లారీలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగాయని డ్రైవర్లు చెబుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా గుంతల్లో నీరు నిలిచి ఉండడంతో ఆ రోడ్డు గూండా వెళ్లే క్రాంతినగర్, రాజా సాహెబ్ నగర్, హైస్కూలు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలకు కనీసం గ్రావెల్ అయినా వేయించాలని కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు కళ్లు తెరిచి గుంతలను పూడ్చాలని, ఆర్‌అండ్‌బి అధికారులు సైతం ప్రధాన రహదారిలో పడిన గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాధవరం రోడ్డులో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

అప్పులబాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - దేవనకొండ

నరసప్ప (ఫైల్)

అప్పుల బాధలు తాళలేక పురుగు మందు తాగి ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన దేవనకొండలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు వివరాల మేరకు... గ్రామానికి చెందిన చిగిలి నరసప్ప (39) గత మూడేళ్లుగా 3 ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, టమోటా వంటి పంటలు సాగు చేస్తున్నారు. గత రెండేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు పండక పెట్టిన పెట్టుబడులు రాక సుమారు రూ.6 లక్షల అప్పులు మిగిలాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై బుధవారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుమందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారిలో నిలిచిన వర్షపు నీరు
- వరి నాట్లు వేసి సిపిఎం నిరసన

రహదారిలో వరి నాట్లు వేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామ బస్టాండ్ ఆవరణలోని ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలిచింది. బుధవారం సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న వరి నాట్లు వేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నౌలేకల్, పెద్దకడబూరు, చిన్నతుంబలం తదితర గ్రామాల ప్రజలు వెళ్లేందుకు ప్రధాన రహదారి ఈ విధంగా ఉందన్నారు. మండలంలోని నాయకులు, సర్పంచి పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి రహదారికి గ్రావెల్ వేయించాలని డిమాండ్ చేశారు. శాఖ కార్యదర్శి శ్రీను, పార్టీ సభ్యులు వీరన్న, సిపిఐ మండల కార్యదర్శి హనుమంతు, రమేష్ పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరిస్తాం
- కౌన్సిలర్ ఫయాజ్

ప్రజాశక్తి - ఆదోని

వార్డులోని సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చొరవ చూపుతున్నామని 39వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం వార్డులోని కాజీ గడ్డ ఏరియాలో వర్షపు నీటితో బావి నిండి ప్రవహించిందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారన్నారు. కమిషనర్ వెంటనే జెసిబి పెట్టి నీరు వెళ్లేందుకు కచ్చా కాలువ టైప్ చేయించడంతో నీరు కాలువల గూండా పోయాయని తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన అధికారులకు ఏరియా ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ ఫయాజ్

పెద్దకడబూరులో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ : టిడిపి

ప్రజాశక్తి -పెద్దకడబూరు

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు గ్యారెంటీ ఉంటుందని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టిడిపి మండల అధ్యక్షులు బసులదొడ్డి ఈరన్న, టౌన్ అధ్యక్షులు వీరేష్ గౌడ్, నాయకులు శివ, ఈరన్న, చంద్రశేఖర్, దాసప్ప రెడ్డి, చిరుతపల్లి తాయన్న పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'పై అవగాహన

దేవనకొండ : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'పై టిడిపి మండల క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జీలు, బూత్ కన్వీనర్లకు అవగాహన కల్పించారు. ఆర్‌టిఎస్ ట్రైనర్ వెంకన్న, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలో సూచనలు, సలహాలు ఇచ్చారు. మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు.

శిక్షణ ఇస్తున్న ట్రైనర్ వెంకన్న, కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్

వెంకటేశ్వరుని దర్శించుకున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -పెద్దకడబూరు

టిటిడి పాలకమండలి సభ్యులుగా ఎంపికైన వై.సీతారామరెడ్డితో కలిసి వైసిపి నాయకులు పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రవిచంద్రారెడ్డి, రఘురాం, విజయేంద్ర రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలు బుధవారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

10, 11న పాదయాత్ర

- హంద్రీనీవాకు గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ వరకు సాగునీరివ్వాలి
- చెరువులన్నింటికీ నీటిని నింపాలి
- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి- దేవనకొండ

హంద్రీనీవా కాల్వకు గుండ్లకొండ దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేసి కోటకొండ, మాచాపురం గ్రామాలకు సాగునీరివ్వాలని రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 10, 11న రైతులతో కలిసి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, రైతుసంఘం మండల కార్యదర్శి సూరి కోరారు. బుధవారం స్థానిక అయ్యప్ప స్వామి గుడి ఆవరణలో పాదయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలం పాలకుల నిర్లక్ష్యానికి, ప్రకృతి నిరాదరణకు గురవుతోందని తెలిపారు. మండలంలో గత రెండేళ్లుగా కరువు ఛాయలు నెలకొన్నాయని చెప్పారు. కరువు పరిష్కారానికి అవకాశాలు, వనరులు ఉన్నా పాలకులు, ప్రజా ప్రతినిధుల చిత్తశుద్ధి లోపంతో కరువు ఏర్పడుతోందని తెలిపారు. గుండ్లకొండ దగ్గర హంద్రీ నీవా కాలువకు స్లూయిజ్ ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బంటుపల్లి, చెల్లెలి చెలిమిల, బేతపల్లి, బండపల్లి, కోటకొండ, వెంకటాపురం, పల్లె దొడ్డి, మాచాపురం వరకు సాగునీరు ఇవ్వడానికి అవకాశం ఉందన్నారు. మండలంలోని రైతులకు సాగునీటికి ఉపయోగపడుతున్నా నేలతలమర్రి చెరువు, గుండ్లకొండ బానకుంట, గుడిమరాళ్ల నిమ్మల బండ చెరువు, తుమ్మలచెరువు, బంటుపల్లి కుంట, చెల్లెలి చెలిమిల చెరువు, బండపల్లి చెరువు, కోటకొండ చిన్నోని చెరువు, మాచాపురం పెద్ద చెరువు, బురకుంట చెరువుకు హంద్రీనీవా ద్వారా నీటిని మళ్లించాలని కోరారు. ఈ ప్రాంతం సస్యశ్యామలం కావడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈనెల 10, 11న రైతు సంఘం ఆధ్వర్యంలో కోటకొండ గ్రామం నుంచి దేవనకొండ తహశీల్దార్ కార్యాలయం వరకు రైతులతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాదయాత్రను ఆయా గ్రామాల రైతులు, కూలీలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష, రైతు సంఘం నాయకులు ఓంకార్, సుంకన్న, యువజన సంఘం నాయకులు మహేంద్ర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరశేఖర్

చిప్పగిరిలో కృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులు

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నేమకల్లు, నగరడోనా గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గ్రామాల పెద్దలు, ప్రజలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం నేమకల్లు గ్రామంలో సర్పంచి ప్రేమ్ కుమార్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బంగారమ్మ అవ్వ దేవాలయం దగ్గర ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ప్రతిమను ప్రతిష్టించారు. వేద పండితులు రాము శాస్త్రి వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం గ్రామ ప్రజలందరికీ అన్నదానం నిర్వహించారు. శ్రీకృష్ణుని ప్రతిమను ట్రాక్టర్‌పై అధిష్టించి వీధుల గుండా ఊరేగించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎంపిపి భర్త జూటూరు మారయ్య హాజరయ్యారు.

బాలుడు ఎశ్విన్

ఆలూరు మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన మునిస్వామి, బిందు ప్రియ దంపతుల 6 నెలల బాలుడు ఎశ్విన్ శ్రీకృష్ణుని వేషధారణలో ఆక్కటుకున్నాడు.

నీటి ముంపు బాధితులను ఆదుకోవాలి : జనసేన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ప్రశాంత్ నగర్‌లో వర్షపు నీటి ముంపు కుటుంబాలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని జనసేన నాయకులు పులి రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆదోనిలోని పార్టీ కార్యాలయంలో సమావేశంలో వారు మాట్లాడారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రశాంత్ నగర్ ప్రాంతంలోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి వస్తువులు, తిండి సామగ్రి తడిసిపోయి అవస్థలు పడుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు గోపాల్, గోవిందు, జెసిబి వీరేష్, బుగ్గప్ప, మౌనేష్, బాష పాల్గొన్నారు.

వైద్యం అందని ద్రాక్షేనా..?

- మధ్యాహ్నానికే మొలగవల్లి ఆస్పత్రికి తాళం - ప్రజలకు సక్రమంగా ఉందని సేవలు

ప్రజాశక్తి-ఆలూరు


ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళం వేసిన సిబ్బంది

వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తుండడంతో మొలగవల్లి ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. 24 గంటలు పని చేయాల్సిన ఆస్పత్రి మధ్యాహ్నం 12 గంటలకే వైద్యులు, సిబ్బంది తాళం వేసి వెళ్తున్నారు. ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికీ వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని ప్రయత్నాలు చేస్తుండగా ఇలాంటి చోట వైద్య సేవలు అందించాల్సిన ఆస్పత్రులు సక్రమంగా పని చేయక ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. స్థానికంగా ఉండాల్సిన వైద్యులు పట్టణ ప్రాంతాల్లో ఉండి చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వైద్యులు సక్రమంగా రాకపోవడంతో సిబ్బందితోనే వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో 30 పడకల ఉన్న ఆస్పత్రిని పడగొట్టి నూతనంగా కొంతకాలం క్రితం 10 పడకలు ఆస్పత్రిగా మార్చారు. ప్రభుత్వం ఆస్పత్రి స్థాయిని తగ్గించినప్పటికీ సేవలు అందించడంలో విఫలమైంది. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారో లేదో ఉన్నతాధికారులు పర్యవేక్షణ కొరవడింది. కలెక్టర్ స్పందించి ఆస్పత్రిని సక్రమంగా నిర్వహించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

- మైనా, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి

ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మొలగవల్లి ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి. మధ్యాహ్నానికే ఆస్పత్రికి తాళం వేయడం వల్ల ప్రజలకు సేవలు అందడం లేదు. అధికారులు స్పందించి ఆస్పత్రిని సక్రమంగా నిర్వహించేలా చూడాలి.

నాగన్నకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఉత్తమ అవార్డు అందుకున్న కోసిగి మండలం చింతకుంట ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు డి.నాగన్నను పలువురు సన్మానించారు. బుధవారం మల్లికార్జున ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో ఘనంగా సన్మానించారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డి.నాగన్న ఉత్తమ అవార్డును ఇన్‌ఛార్జీ కలెక్టర్ ఎన్.మౌర్య, డిఇఒ రంగారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. నాగన్న అనేక గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో పనిచేసి ప్రస్తుతం కోసిగి మండలం చింతకుంట ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. నాగన్నను మిత్రులు పకీరప్ప (మమత మెడికల్స్), శివరాం రెడ్డి, బనవాసి సంజీవరెడ్డి శిష్యులు (మల్కాపురం బీరప్ప, ఆపిల్ ల్యాబ్ అధినేత), వెంకటాపురం డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్లు బాలాజీ (చిన్నపిల్లల వైద్యులు), మల్లికార్జున (ఆర్థోపెడిక్ వైద్యులు), సాక్షి విలేకరి హేమంత్ కుమార్, ఈనాడు విలేకరి రామకృష్ణ, బోడబండ నరసింహులు, దొడ్డిమేకల మధుసూదన్ రెడ్డి, వీరేష్, బనవాసి నరసింహులు, నరసప్ప సన్మానించారు.

ఆనందంగా ఉంది

- కురువ బీరప్ప,యాపిల్ ల్యాబ్ అధినేత

నేను నాగన్నను చిన్నప్పటి నుంచి గురువుగా భావిస్తున్నాను. నేను మా గురువు గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇలాంటి పురస్కారం ఆయన ఎప్పుడో అందుకోవాలి. ఆయనకు ఇలాంటి పురస్కారాలు అందుకోవడం, సన్మానించుకోవడం ఇష్టం ఉండదు. ఆయన విద్యార్థులకు చేస్తున్న సేవలకు గాను ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ఇవ్వడం ఆనందంగా ఉంది.

నాగన్నను సన్మానిస్తున్న నాయకులు

జర్నలిస్టు సమస్యలే అజెండా

- ఐజెయు నాయకులు గోరంట్ల కొండప్ప, నాగరాజు, ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్
-నియోజకవర్గ అధ్యక్షులుగా జయరాజు ఎన్నిక

ప్రజాశక్తి - మంత్రాలయం

జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలే అజెండాగా ఎపియుడబ్ల్యుజె పని చేస్తోందని జాతీయ జర్నలిస్టు యూనియన్ నాయకులు గోరంట్ల కొండప్ప, నాగరాజు, ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్ తెలిపారు. బుధవారం స్థానిక రాఘుసుధా డార్మెటరీ హాలులో నియోజకవర్గ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమంపైనా నిరంతరంగా పోరాటం చేసే ఏకైక యూనియన్ ఎపియుడబ్ల్యుజె, ఐజెయు మాత్రమేనని తెలిపారు. జర్నలిస్టుల ఇంటి స్థలాలు, జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య, అక్రిడిటేషన్ల కోసం పోరాటం చేస్తున్నామని చెప్పారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో మాట్లాడుతూ వాటి సమస్యలపై కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షులుగా వి.జయరాజు, ప్రధాన కార్యదర్శిగా హుస్సేని, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకున్న వారికి బాధ్యతలు అప్పగించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ... త్వరలోనే పీఠాధిపతి సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మంత్రాలయంలో నూతన ప్రెస్ క్లబ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. మిగిలిన మండలాల్లో కూడా ప్రెస్ క్లబ్‌లు, జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులు చాంద్ బాషా, సహాయ కార్యదర్శి అనిమేష్, జిల్లా కోశాధికారి అంజి, జిల్లా నాయకులు హరికృష్ణ, శివ, నియోజకవర్గ కోశాధికారి సాబువలీ, సీనియర్ పాత్రికేయులు మాధవ్, కౌతాళం మండల అధ్యక్షులు విజయ్ కుమార్, కోసిగి మండల అధ్యక్షులు షబ్బీర్, మంత్రాలయం కోశాధికారి రఫీ, గౌరవాధ్యక్షులు రానోజీరావు, మహ్మద్, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర గౌడ్, నరసప్ప, ఎనుముల ఈరన్న, వడ్డే వెంకట్రాజు, బాబు రావు, పాత్రికేయులు కంతం నరసింహ, మహబూబ్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ఆర్‌బికెలో అందుబాటులో ఎరువులు
- ఎఒ వరప్రసాద్

ఫోటో : ఎరువులు అందజేస్తున్న ఎఒ వరప్రసాద్

ప్రజాశక్తి -పెద్దకడబూరు

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎఒ ఎం.వరప్రసాద్ తెలిపారు. బుధవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని కంపెనీల ఎరువులూ ఒకటేనని తెలిపారు. అన్నింటిలో నిర్దేశించిన శాతం మూలకాలు ఉంటాయని చెప్పారు. రైతులు అనవసరంగా కొన్ని కంపెనీ ఎరువులపై మోజు పెంచుకోవద్దని తెలిపారు. ఎరువులు అన్నీ కంపెనీలకు అతీతంగా 'భారత్' అనే పేరు మీద లభ్యమవుతున్నాయని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండే అన్ని కంపెనీల ఎరువులను ఒకే దృష్టితో చూసి వినియోగించుకోవాలన్నారు. యూరియా, ఇతర ఎరువులను ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందుబాటులో ఉన్న ఎరువు సంచులను నిర్ణీత సంఖ్యను మించి ఎవరికీ ఇవ్వరాదని, ఆర్‌బికెలలో ఎరువులు అయిపోయిన వెంటనే ఆర్డర్ చేయాలని ఆర్‌బికె సిబ్బందికి సూచించారు. **గోనెగండ్ల**లో ఎమ్మిగనూరు ఎడిఎ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత మాట్లాడారు. వెముగోడులో 8.5 టన్నుల ఎరువులు, అగ్రహారంలో 14 టన్నులు, బైలుప్పలో 13.5 టన్నులు, గంజిహల్లిలో 19.5 టన్నులు, కైరవాడిలో 9 టన్నులు, నేరెడుప్పలలో 6.5 టన్నులు, పెద్దనేలటూరులో 10 టన్నులు, పుట్టపాశంలో 10 టన్నులు, తిప్పనూరులో 17 టన్నులు, పెద్దమర్రివీడులో 18 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా
- కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహేంద్ర నాయుడు

ప్రజాశక్తి - దేవనకొండ

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహేంద్ర నాయుడు తెలిపారు. బుధవారం దేవనకొండలోని కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరామ్ కొన్ని గ్రామాల రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారని చెప్పారు. ఆ రహదారుల నిర్మాణాలు జరగకపోవడం విచారకరమన్నారు. తక్షణమే రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల ప్రజలు దోమ కాటుకు గురై విష జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. హంద్రీనీవా పెండింగ్ కాలువల నిర్మాణాలను తక్షణమే పూర్తి చేయాలని కోరారు. దేవనకొండలో 108 అంబులెన్స్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలను, యువతను చైతన్యం చేసి పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామన్నారు. కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు శ్రీనివాసులు, ఖాసీం, శ్రీరాములు, పరమేష్, బాబు, రవి, ఉపేంద్ర, హరి, మహేష్ పాల్గొన్నారు.

మ్యాన్ హోల్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో హెచ్‌బిఎస్ కాలనీ ఎల్‌ఐసి కార్యాలయం లైన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టారు. బుధవారం స్థానిక 21వ వార్డు టిడిపి కౌన్సిలర్ బిజిఎ.దయాసాగర్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. గతంలో అండర్ గ్రౌండ్‌కు వేసిన మ్యాన్‌హోల్ విరిగిపోయింది. కొత్త మూతను చేయించి అమర్చారు. దగ్గర ఉండి మరమ్మతులు చేయించిన దయాసాగర్‌ను కాలనీ వాసులు అభినందించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

రేషన్‌లో 'కంది'పోయింది

- ఆగిన కేటాయింపులు
- లబ్ధిదారులకు చేరని కందిపప్పు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల్లో రోజు రోజుకూ కోత పడుతోంది. ఇచ్చే సరుకుల్లో తాజాగా కందిపప్పు ఆగిపోయింది. కేటాయింపులు ఆగిపోవడంతో లబ్ధిదారులకు కందిపప్పు చేరడం లేదు...

నంద్యాల జిల్లాలో 1,204 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 351 ఎండియు వాహనాల ద్వారా 5,33,496 మందికి రేషన్ సరుకులు అందిస్తున్నారు. జూన్, జులై నెలలకు కలిపి కార్డుదారులకు ఆగస్టులో కందిపప్పు సరఫరా చేస్తామన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మాటలు నీటి మూటలయ్యాయి. ఆగస్టులో అందలేదు. సెప్టెంబరులో కేటాయింపులు జరగలేదు. పౌరసరఫరాల గోదాముల్లో కిలో కంది పప్పు కూడా నిల్వ లేదు. మొన్న టమాటా ధరలు ఆకాశాన్నంటాయి.. ప్రస్తుతం ఉల్లి ధరలు పెరుగుతున్నాయి.. తాజాగా కందిపప్పు ధరలకు రెక్కలొచ్చాయి. కిలో కందిపప్పు దాదాపు రూ.200కు చేరువలో ఉంది. సామాన్యుడికి పప్పన్నం భారంగా మారింది. చౌక దుకాణాలు, ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్నా నాలుగు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదని పేద, మధ్య తరగతి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు కార్డుదారులకు కందిపప్పు పంపిణీ ఆగిపోయింది. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర భగ్గుమంటోంది. గత మూడు నెలలుగా వచ్చే నెల ఇస్తామని చెబుతూ తప్పించుకుంటున్నారు. సెప్టెంబరులోనూ చేతులెత్తేయడంతో బియ్యంతో ఎలా సరిపెట్టుకోవాలని కార్డుదారులు ఎండియు వాహనదారులపై మండిపడుతున్నారు. కందిపప్పు ఇవ్వకపోతే మా వీధికి రేషన్ బండి తీసుకురావొద్దని కొన్నిచోట్ల స్పష్టం చేస్తున్నారు. బయట మార్కెట్లో కిలో కంది పప్పు రూ.160-180కు పైగా ఉంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా గతంలో కందిపప్పు కిలో రూ.67కే ఇచ్చేవారు. ప్రస్తుతం సరఫరా లేక పోవడంతో రెండింతలు అదనపు భారం పడుతోంది. తక్కువ ధరకే నిత్యావసరాలు రైతుబజార్ల ద్వారా వినియోగదారులకు అందిస్తున్నామని, ఇందులో భాగంగా రైస్ మిల్లర్లు, ట్రేడర్ల ఆధ్వర్యంలో రైతుబజార్లలో కౌంటర్లు ఏర్పాటు చేయించామని, కిలో కందిపప్పు రూ. 140కే అమ్మకం చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. నగరంలో సి. క్యాంపు రైతుబజారు, కొత్త పేట, ఆదోనిలో కందిపప్పు కిలో రూ. 140కు విక్రయిస్తున్నట్లు పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. జులై 17 నుంచి రైతుబజార్లలో కౌంటర్లు ప్రారంభించగా 45 రోజుల వ్యవధిలో 3 క్వింటాళ్ల కందిపప్పు అమ్మారంటే నాణ్యత ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. బహిరంగ మార్కెట్‌లో రెండో రకం కందిపప్పు కిలో రూ.160 కుపైగా ఉండగా రైతు బజారులో రూ.140కు అమ్మేందుకు వ్యాపారులు ససేమిరా అంటున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు

- గర్భిణులకు ఎఎన్ఎంలు, ఆశాలు అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలోనే గర్భిణులు ప్రసవించేలా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో లక్ష్యం మేరకు ప్రసవాలు జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని మెడికల్ అధికారులను, వైద్య సిబ్బందిని ఆదేశించారు. పిహెచ్‌సిలలో కాన్పులు కష్టమై సిజేరియన్ చేసే పరిస్థితులు ఏర్పడితే సమీప సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులకు రెఫర్ చేసి పంపాలని సూచించారు. పేద ప్రజలు అనవసరంగా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బు వృధా చేసుకోకుండా, ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని గర్భిణులకు అవగాహన కల్పించడంతో పాటు హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే డెలివరీలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎం, ఆశా వర్కర్లను, వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య నిమిత్తం నిర్దేశించిన నెలవారీ లక్ష్యాలను ఖచ్చితంగా సాధించాలని సూచించారు. బనగానపల్లి వంద పడకల ఆసుపత్రి స్థాయికి చేరుకున్న నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాలైన ఉప్పలపాడు, అవుకు, టంగుటూరు, పలుకూరు తదితర పిహెచ్సిలను అనుసంధానం చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే డోన్‌లోని వంద పడకల ఆసుపత్రికి కూడా చుట్టుపక్కల గ్రామాలను అనుసంధానం చేసి వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ వెంకటరమణ, డిసిహెచ్ఎస్ కోఆర్డినేటర్ డా.జఫ్రుల్లా, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాద్, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ రూపేంద్ర నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

- బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి నివాసంలో రాత్రి బస

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి నివాసంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నేడు రాత్రి బస చేయనున్నారు. బుధవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో చంద్రబాబు నాయుడు రాత్రి బస చేసే ప్రాంతాన్ని, రూములను డోన్ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిసి మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లాకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు గుత్తి లో కార్యక్రమం అనంతరం నేడు గురువారం తమ నివాసంలో రాత్రి బస చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ శుక్రవారం మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐ తిమ్మారెడ్డి, ఎస్ఐ రామిరెడ్డి, నందివర్గం ఎస్ఐ రామాంజనేయ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, డోన్ నియోజకవర్గం ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **ప్యాపిలి :** భవిష్యత్తుకు గ్యారెంటీ బాబు షూరిటీ కార్యక్రమానికి గురువారం విచ్చేయుచున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని డోన్ ఇన్చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వై.నాగేశ్వరరావు యాదవ్ కోరారు. ప్యాపిలి పట్టణ టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ బాబు షూరిటీ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లాలోని గుత్తిలో సభ ముగించుకుని ప్యాపిలి పట్టణం మీదుగా బనగానపల్లెకు చేరుకుంటారు. కావున మండలంలోని నాయకులు, నందమూరి అభిమానులు, కార్యకర్తలు ప్యాపిలి పట్టణంలో పెద్ద ఎత్తున స్వాగతం పలకాలని పార్టీ నాయకులను కోరారు. కార్యక్రమంలో గౌతంరెడ్డి, రాఘవేంద్ర, అంకిరెడ్డి, రామసుబ్బయ్య, రాంమోహన్ యాదవ్, చిన్న సుంకయ్య, సుదర్శన్, నాగేంద్ర, మధు, చల్లా వీర, కొంగనపల్లె మధు, మల్లికార్జున, శ్రీనివాసులు, ఎస్‌కె వలి, రాము, వెంకటేశ్వర రెడ్డి, రామిరెడ్డి, పోదొడ్డి నారాయణ, పుల్లారెడ్డి, కదిరిప్ప, దీపు, పుల్లయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు రాత్రి బస చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

'పత్తి'కి ఎర్ర తెగులు

- ఎండిపోతున్న పత్తి చెట్లు
- పూర్తిగా పడిపోయిన దిగుబడి
- ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్న ఏదో ఒక రకంగా నష్టపోతూనే ఉన్నాడు. పత్తి రైతులను సమస్యలు చుట్టుముట్టాయి. పత్తి పంటకు వైరస్, ఎర్ర తెగులు రావడంతో పత్తి చెట్లు ఎదుగు బొదుగు లేకుండా ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి రూ. 50 వేల నుండి 60 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి పత్తి పంటను సాగు చేస్తే రెండు క్వింటాలు కూడా దిగుబడి రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని పసుపల, పసుపల తండా, పెద్దరాజుపాలెం, కాలే నాయక్ తండ, బద్రే నాయక్ తండా, చిన్న రాజుపాలెం, చిన్నరాజుపాలెం తండా, క్రిష్ణగిరి, చెర్లో కొత్తూరు, జోలాపురం, పాతపాడు, మీరాపురం, యాగంటి పల్లె, సాదు కొట్టం, మాదాసు పల్లె, యనకండ్ల, ఎర్రగుడి తదితర గ్రామాలలో 600 ఎకరాలలో రైతులు మే నెలలో బోర్ల కింద పత్తి పంటను సాగు చేశారు. ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తి పంట పెరగకపోవడం, గులాబీ రంగు పురుగు, ఎర్ర తెగులు, రసం పీల్చు పురుగుల వల్ల పంట ఎర్రబారి ఎదుగు బొదుగు లేకుండా చెట్లు అలాగే ఉన్నాయి. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 10 క్వింటాల పత్తి దిగుబడి వచ్చేది. కానీ ఎర్ర తెగులు, గులాబీ రంగు పురుగులతో పత్తి చెట్లు ఎర్రబారీ చనిపోతున్నాయి. దీంతో ఎకరానికి రెండు క్వింటాలు కూడా దిగుబడి రాని పరిస్థితి నెలకొంది. ఎకరానికి రూ. 50 వేలు పెట్టుబడి పెట్టి పత్తి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెలలో వర్షాలు లేకపోవడంతో పంట ఎదుగుదల లేదని, జూలై నెలలో కురిసిన అరకొర వర్షాలతో ఊపిరి పోసుకున్న పత్తి చెట్లు ఎర్ర తెగులు రావడంతో పంట పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని పత్తి రైతులు కోరుతున్నారు.

వైరస్‌తో ఎదుగు, బొదుగు లేని పత్తి పంట

పది ఎకరాల్లో పత్తి సాగు చేసి తీవ్రంగా నష్టపోయా

- రైతు సుధాకర్ రెడ్డి, పెద్దరాజుపాలెం గ్రామం.

పది ఎకరాలలో పత్తి పంట సాగు చేసి దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయాను. పత్తి పంటకు గులాబీ రంగు పురుగు, ఎర్ర తెగులు వచ్చి చెట్లు చనిపోతున్నాయి. తెగుళ్లతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఎకరానికి రూ. 50 వేలకు పైగా పెట్టుబడి పెడితే రూ. 20 వేలు కూడా రాని పరిస్థితి నెలకొంది.. ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి.

శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం మొదలైంది. గత 17 రోజుల తర్వాత ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదనతో మాత్రమే 39,990 క్యూసెక్కులు, హంద్రీ నుండి 117 క్యూసెక్కులు కలిపి మొత్తం 40,107 క్యూసెక్కుల నీరు జలాశయానికి వచ్చి చేరుతున్నాయి. అలాగే తెలంగాణ రాష్ట్ర పరిధిలోని భూగర్భ జలవిద్యుత్ కేంద్రం, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయం నీటి మట్టం 851.20 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 82.7663 టిఎంసిలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 1,500, హంద్రీనీవా సుజల స్రవంతికి 1315, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ 2,400 క్యూసెకులను విడుదల చేస్తున్నారు.

మాట్లాడుతున్న మౌలానా ముస్తాక్ అహ్మద్

లోకేష్ పై రాళ్ల దాడి దారుణం

- వైసిపి గుండాలను వెంటనే అరెస్టు చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : భీమవరంలో యువగళం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబుప స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ వైసిపి గుండాలను పంపి రాళ్ల దాడి చేయించడం దారుణమని టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ తీవ్రంగా ఖండించారు. బుధవారం నంద్యాలలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేష్‌పై దాడి చేయడాన్ని రాష్ట్ర ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. దాడులు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ దాడిపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో వైసిపికి, ముఖ్యమంత్రికి ప్రజలే బుద్ధి చెప్పి దేహశుద్ధి చేస్తారన్నారు. ఈ నెల 8న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నంద్యాలలో పర్యటించనున్నారని తెలిపారు. నంద్యాలలోని గాంధీ చౌక్‌లో జరిగే చంద్రబాబు భారీ బహిరంగ సభకు పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు, కార్మికులు భారీ ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మానియర్ ఖలీల్, ఫ్లోర్ లీడర్ మహబూబ్ వలి, 1వ వార్డు కౌన్సిలర్ నాగార్జున, 35వ వార్డు ఇన్చార్జ్ నూరు భాష, యూత్ అధ్యక్షుడు గుల్లి, సీనియర్ నాయకులు అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చల్లా రామకృష్ణారెడ్డి జయంతి

ప్రజాశక్తి - అవుకు : దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి జయంతి వేడుకలను అవుకు పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. చల్లా సమాధి వద్ద పెద్ద కుమారుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, సోదరులు వైసిపి సీనియర్ నాయకులు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా భాస్కర్ రెడ్డి, చల్లా రఘునాథరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియం చంద్రారెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చల్లా అభిమానులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు.

చల్లా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న

పత్తి రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - పాణ్యం

తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు, చీడ పురుగులు, తెగుళ్ల వల్ల పత్తి పంట వేసి తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి. సుబ్బరాయుడు, జిల్లా నాయకులు పిన్నాపురం ప్రసాద్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పాణ్యం మండలం తమ్మరాజు పల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంటను నాయకులు పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ సుమారు 280 ఎకరాలలో డి, బస్వ-డి, కిలాడి రకం పత్తివిత్తనాలు ఖరీఫ్ సీజన్లో సాగు చేశామని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు తక్కవ పడినా ఎంతో వ్యయప్రయసాలతో పత్తి పైరు ఎండిపోకుండా బోరుబావుల ద్వారా అద్దెలు చెల్లించి నీటితో పొలాలను తడిపినా కూడా పత్తి చెట్లకు కాయలు కాయలేదని, చెట్లన్ని ఎర్రగా మారి ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు దాదాపు 50 వేలు రూపాయలు ఖర్చులు అయ్యాయ్యని నాయకుల దృష్టికి తెచ్చారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, సంబంధిత వ్యవసాయ అధికారులు వెంటనే పత్తి పంటలను పరిశీలించి, ఉన్నతాధికారులకు తెలియజేసి, రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్ బాలచంద్రుడు, ఆకులవెంకట సుబ్బయ్య, ఆకుల రామాంజనేయులు, కె.మద్దిలేటి, టేకూరు అచ్చన్న, వెంకటరాముడు, జి.పుల్లయ్య, శివుడు, గోరుకల్లు మహేంద్ర, కట్టుబడి బాలమద్దిలేటి, కట్టుబడి లక్ష్మన్న, శ్రీరాములు, మండ్ల మధుసూదన్ నాయుడు, రైతులు, కౌలురైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల వల్ల దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

సమస్యల నడుమ గిరిజన బాలుర వసతి గృహం

- రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

సున్నిపెంటలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందని, పట్టించుకొనే వారే లేరని ఎస్ఎఫ్ఐ శ్రీశైలం మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్‌వలి, జయంత్ అన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహం చుట్టూ ప్రహరీ గోడ ఉన్నా గేట్లు లేకపోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. వాటికి సంబంధించి వచ్చిన నిధులు ఏం చేశారని ప్రశ్నించారు. వసతి గృహానికి రహదారి ఏర్పాటు కోసం నిధులు వచ్చాయని, వాటిని ఏం చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ వార్డెన్ లేక ఇన్చార్జ్ నియమించారని, ఆయన కిలోమీటర్ల దూరం నుంచి రావాలంటే సమస్యగా మారిందని, ఇక్కడ ఉండే విద్యార్థుల పరిస్థితి పట్టించుకునే వారే లేరన్నారు. అడిగేవారు లేక ఇన్చార్జి వార్డెన్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం 3 గంటలకు భోజనం వండితే రాత్రి 7 గంటలకు చేయాల్సి వస్తుందని అన్నారు. ఆర్వో మినరల్ ప్లాంట్ ఉన్నా వినియోగించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. విద్యార్థులు తాగునీటికి కూడా ఇబ్బంది పడడం బాధాకరమన్నారు. మరుగుదొడ్లకు డోర్‌లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హాస్టల్ ఆవరణం పశువులకు నిలయంగా మారుతోందని అన్నారు. వెంటనే గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి హాస్టల్‌కి రెగ్యులర్ వార్డెన్‌ను, గేటు ఏర్పాటు చేయాలి, సిసి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం మండల నాయకులు రాజు, దివాకర్ పాల్గొన్నారు.

గేటు లేకుండా ఉన్న ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్నిచూపుతున్న నాయకులు

భూ రీ సర్వేను పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి - ఆత్మకూరు

భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో జరుగుతున్న భూ సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రెవెన్యూ అధికారులకు, సర్వే సిబ్బందికి ఆయన తగు సూచనలు ఇచ్చారు. భూ రీసర్వే కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఉమాదేవి, రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ రీసర్వే చేయాలి : డిప్యూటీ తహశీల్దార్

కొత్తపల్లి : గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే పనులు పకడ్బందీగా చేయాలని డిప్యూటీ తహశీల్దార్ పెద్దన్న తెలిపారు. కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి, శివపురం గ్రామాలలో భూ రీసర్వే కార్యక్రమం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామానికి 5, శివపురం గ్రామానికి 3 టీములను ఏర్పాటు చేసి రీ సర్వే పనులు చేస్తున్నామన్నారు. గ్రామాల్లోని రైతుల ఆధ్వర్యంలోనే వారి పొలాలకు చెందిన హద్దుల వద్ద నుంచి రోవర్ మిషన్తో కొలతలు తీస్తున్నట్లు చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీర్వోలు లింగేశ్వర్, బాబు మియా, మౌలాలి, వేణుగోపాల్, విలేజ్ సర్వేయర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జెసి

క్రీడాకారులను అభినందిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

తైక్వాండో విజేతలకు డిఎస్‌పి అభినందన

ప్రజాశక్తి - ఆత్మకూరు

గత నెల 26, 27వ తేదీలలో బెంగళూరులో జరిగిన వెస్టర్స్ కప్ మొదటి జాతీయ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్షిప్ కివిర్గీ, ఫుంసే, డెమో పోటీలలో బంగారు పతకాలను సాధించిన ఆత్మకూర్ క్రీడాకారులను డిఎస్‌పి శ్రీనివాసరావు అభినందించారు. బుధవారం ఆత్మకూర్ పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయంలో మెడల్స్ సాధించిన క్రీడాకారులు ఎస్.ఖాజా మొహిద్దీన్, ఎస్.అల్తాఫ్ హుస్సేన్‌లకు మెడల్స్ అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ ప్రాంత విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తైక్వాండో శిక్షకులు ఎస్.ఖాజా హుస్సేన్, జి.షబ్బీర్ హుస్సేన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుల తల్లిదండ్రులు ఎస్.జైలాన్ పాల్గొన్నారు.

8న మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఎపి రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8న నిర్వహించే మినీ జాబ్ మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి పివి.ప్రతాపరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మినీ జాబ్ మేళాలో 4 కంపెనీలు పాల్గొంటాయని, పదవ తరగతి, డిప్లొమ, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన వారు అర్హులని, ఇంటర్వ్యూలకు అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫోటోలతో హాజరుకావాలని తెలిపారు. వయసు 18 నుండి 30 సంవత్సరాలలోపు ఉండాలని, మరిన్ని వివరాలకు www.apssdc.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ట్రాక్టర్ చక్రం కింద పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డి పల్లె గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిత్య(14) అక్కడికక్కడే మతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆదిత్య ట్రాక్టర్ ఇరుసుపై (ట్రాలీకి-ఇంజిన్ కలిపే భాగం) నిలబడి ఉండి ఉండగా అదుపుతప్పి కింద పడడంతో వెనక చక్రం మీదికి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వంటశాల గదిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

వంటశాల గది నిర్మాణం పూర్తి చేయాలి : చైర్మన్

ప్రజాశక్తి - డోన్ : డోన్‌లోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న వంటశాల గదిని తొందరగా పూర్తి చేయాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల.రాజేష్ ఆదేశించారు. బుధవారం డోన్ పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన ఉన్న కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో రూ. 4 లక్షల 90 వేలతో నిర్మిస్తున్న వంటశాల గది పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం స్లాబ్ వేసి పని రోజులు అయిందని, మరో 15 రోజుల్లో పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పిఏ రమేష్ రెడ్డి, వైసిపి నాయకులు బోయ అశోక్, సచివాలయం అమ్యూనిటీస్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సంగయ్య పేట 8వ వార్డులో గత రాత్రి మెయిన్ వైర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏర్పడిన విద్యుత్ సమస్యను వార్డు నాయకులు పరిష్కరించారు. విద్యుత్ సమస్యను వార్డు ఇంచార్జ్ శాలి భాష మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ద్వారా విద్యుత్ అధికారులకు వివరించారు. వెంటనే సమస్యను పరిష్కరించారు. వార్డులో ఏ సమస్య వచ్చినా తక్షణమే చర్యలు చేపట్టి పరిష్కరిస్తున్న కౌన్సిలర్ యం.కరీష్మా, వార్డు ఇంచార్జ్ శాలిభాషకి వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షేక్షావలి, అబ్దుల్లా, శాలి ఫైల్వాన్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్లకు అదనపు ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి - బేతంచర్ల : రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో బేతంచర్ల మండలానికి అదనపు ఆర్టీసీ బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసినట్లు ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం నంద్యాల నుంచి బేతంచెర్ల వరకు నడుస్తున్న బస్సులతో పాటు రాత్రి 8 గంటలకు అదనంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి శుక్ర, శనివారాలలో డోన్, బనగానపల్లె డిపోల నుంచి మండలంలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బస్సు సౌకర్యం, నంద్యాల నుంచి బేతంచెర్ల మీదుగా డోను ప్యాపిలి మీదుగా పత్తికొండకు బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. బేతంచెర్ల నుంచి వెల్దుర్తికి నిలిచిపోయిన బస్సు సర్వీసు ఉదయం, సాయంత్రం వేళల్లో పునర్దించినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మండలానికి ఏర్పాటు చేసినందుకు మండలంలోని ప్రజల తరపున ఆర్థిక మంత్రి బుగ్గనకు ధన్యవాదాలు తెలియజేశారు.

వైభవంగా నాగుల ప్రతిష్ట

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో నాగ విగ్రహాల ప్రతిష్ట బుధవారం అత్యంత వైభవంగా జరిపారు. వేదపండితుల వేదమంత్రాల నడుమ ప్రతిష్టను జరిపారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.. కార్యక్రమంలో హిందూ ఐక్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహానంది దేవస్థానంలో ఘర్షణ

ప్రజాశక్తి - మహానంది

మహానంది దేవస్థానంలో ఘర్షణ బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ధ్యాన మండలి చెందిన సభ్యులు కొంతమంది మహానంది క్షేత్రంలోకి ఉచిత దర్శన నిమిత్తం వెళ్లడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో క్షేత్రంలో మహా మంగళ హారతులు కార్యక్రమం జరుగుతూ ఉన్నందున ప్రధాన ఆలయాల్లోకి ప్రవేశించడానికి ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుందని, కొంత సమయం తర్వాత ఉచిత దర్శనానికి అనుమతిస్తామని ఆలయ సిబ్బంది వారికి తెలియజేసినట్లు సమాచారం. అయినా వారు వినకుండా ఆలయ సిబ్బందిపై ధ్యానమండలి సభ్యులు దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఆలయ ఈవోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ విషయంపై పంచాయతీ మహానంది పోలీస్ స్టేషన్‌కు చేరినట్లు సమాచారం. స్థానికుల కథనం మేరకు ప్రముఖ శైవ క్షేత్రం మహానంది పుణ్యక్షేత్రంలో సాధారణ భక్తులకు ఉచిత దర్శనం కరువైంది. బుధవారం సాయంత్రం సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులను నిలువరించి ఒక్కొక్కరు 200 రూపాయలు విలువ చేసే టికెట్ తీసుకుంటేనే దర్శనానికి ఆలయ సిబ్బంది చెప్పడంతో భక్తులకు ఆలయ సిబ్బందికి తోపులాట మధ్య జరిగింది. ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం టికెట్ ధరలు పెడుతున్నారా లేక ఆలయానికి ఆదాయమే పరమావధిగా టికెట్ పెడుతున్నారో అర్థం కావడం లేదని భక్తులు వాపోతున్నారు. పుణ్యక్షేత్రంలో ప్రతినిత్యం మైకుల ద్వారా అభిషేకం టికెట్లు, ఆర్జిత సేవ టికెట్ల సమయాలు తెలుపుతుంటారు. కానీ ఉచిత దర్శన సమయాలు వెళ్లే మార్గాలు మాత్రం తెలపని భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆలయ అధికారులు భక్తుల సౌకర్యం కోసం ఉచిత దర్శనం అందరికీ అందేలా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని నాయి బ్రాహ్మణ వీధిలోని రామాలయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండలంలోని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.మధుసూదన్ రావును నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు పి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందన్నారు. మధుసూదన్ రావు 33 సంవత్సరాల నుండి అంకిత భావంతో విధులు నిర్వర్తించడంతో ప్రభుత్వం గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించిందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఆర్. శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, నాయి బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు రామ మద్దిలేటి, ట్రెజరర్ శివయ్య నాయకులు రామాంజనేయులు, రామ కృష్ణయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని జమాతే ఇస్లామి హింద్ కార్యాలయంలో శాఖ అధ్యక్షులు ఎం.ఎం.అబీబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత జిలానీ బాషను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కలీం, ఇక్బాల్, ఖాన్, రైస్ మిల్ ఇర్ఫాన్ ఖాన్, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

నంద్యాల : గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రోటరీ ఆవరణలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత భాషా పండితులు శ్రీనివాస్ రెడ్డికి ఘనంగా ఆత్మీయ సన్మానం నిర్వహించారు. వివిధ రంగాలలో అనేక రకాల సేవలు అందిస్తూ అందరి మన్ననలు అందుకున్న శ్రీనివాసరెడ్డి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందడం గ్రీన్ సొసైటీకి గర్వకారణంగా ఉందని గౌరవ అధ్యక్షుడు శ్రీనిధి రఘువీర్ కొనియాడారు. రోటరీ సంస్థ అధినేత డీవీ సుబ్బయ్య, మహానంది మండల విద్యాధికారి రామసుబ్బయ్య, పౌశా శ్రీనివాసులు, శేషఫణి, మహబూబ్బాషా, నీలంవెంకటేశ్వర్లు, కొప్పుల ప్రసాదు, రఫీ నారాయణ, సాయి కిరణ్ ,సంతోష్, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు

గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జయలక్ష్మి

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి - రుద్రవరం : పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని తిప్పారెడ్డిపల్లి అంగనవాడీ సెంటర్‌లో పోషణ మహోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే విధంగా ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త వరలక్ష్మి, ఎంఎల్.హెచ్.పి, నిరీక్షణ, హెల్త్ అసిస్టెంట్ రామలక్ష్మి, ఆశ కార్యకర్త శ్రీదేవి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

యువతి కిడ్నాప్

- 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని పెద్దబోధనం గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువతిని వరుసకు బంధువులైన వ్యక్తులు కిడ్నాప్ చేశారు. 24 గంటల్లోనే పోలీసులు కిడ్నాప్‌ను ఛేధించి యువతిని తల్లికి అప్పగించారు. ఎస్సై రమణయ్య తెలిపిన వివరాల మేరకు మంగళవారం గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన రామసుబ్బయ్య, దస్తగిరి, సంజీవరెడ్డిలు కిడ్నాప్ చేశారు. బాధితురాలి తల్లి నీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కిడ్నాప్ చేసిన యువతిని కడప జిల్లా చింతకొమ్మదిన్నె సమీపంలో కారులో తీసుకెళ్తుతుండగా గుర్తించి పోలీసులు పట్టుకున్నారు. వెంటనే చాగలమర్రి స్టేషన్కు తరలించి యువతిని తల్లి నీలావతికి అప్పజెప్పారు. కిడ్నాప్ చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

టిడిపిని గెలిపించండి : బిసి ఇందిర

ప్రజాశక్తి - సంజామల : రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిర పేర్కొన్నారు. బుధవారం సంజామలలో నిర్వహించిన భవిష్యత్తుకు గారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో తోకల మద్దిలేటి, మల్కి హుస్సేన్, సాల వెంకటసుబ్బయ్య, మాధవ, వాహబ్, ఇద్రుజ్ భాష, మహిళలు పాల్గొన్నారు.

మున్సిపల్ మంత్రి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

ఉపాధ్యాయుల పట్ల మున్సిపల్ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.జాకీర్ హుస్సేన్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పివి ప్రసాద్, జె.సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడారు. విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య నిరంతర భౌతిక సంబంధాలు ఉండటం ద్వారానే పరిపూర్ణ విద్యార్థిగా తయారు అవుతారని,నైతిక విలువలు, సామాజిక, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేది ఖచ్చితంగా ఉపాధ్యాయుల సాన్నిహిత్యం మాత్రమేనని తెలిపారు. కార్పొరేట్లకు అనుకూలంగా సాక్షాత్తు మంత్రి మాట్లాడటం తీవ్ర ఆక్షేపనీయమని విమర్శించారు. ఇప్పటికైనా మంత్రి వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించు కోవాలని, అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఉపాధ్యాయులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. **ప్యాపిలి :** ఉపాధ్యాయుల పట్ల మున్సిపల్ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు బొజ్జన్న, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్ ప్రకటనలో పేర్కొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట కార్యదర్శి నాగమణి

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ వైద్యులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల మాతాశిశుసంరక్షణ బ్లాక్‌లో జిల్లాలోని వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ మరణాలు జరగకుండా తీసుకోవలసిన చర్యలను, జగనన్న ఆరోగ్య సురక్ష గురించి వైద్యాధికారులకు డిఎంహెచ్ఒ వివరించారు.

ఉచితంగా మందులు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల : మదర్‌థెరిసా వర్ధంతి, ప్రపంచ చారిటీ దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ తరపున సీనియర్ సభ్యుడు రవి ప్రకాష్ వికలాంగుల సంక్షేమ సంఘానికి అందజేసిన విరాళం రూ. 8 వేలతో దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వికలాంగులకు మందులను కొనుగోలు చేసి బుధవారం నంద్యాల వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో పంపిణీ చేశారు.లయన్స్ క్లబ్ అధ్యక్షులు పివి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌యు సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నంద్యాల : ఈ నెల 7, 8 తేదీల్లో గుంటూరులోని అంబేద్కర్ భవన్‌లో జరిగే రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ కోరారు. నంద్యాలలో రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి చేతులమీదుగా బుధవారం సదస్సు కరపత్రం విడుదల చేశారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు : మేనేజర్

ప్రజాశక్తి - బేతంచర్ల : కర్నూలు పట్టణం నుండి బేతంచెర్ల మార్గంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు బహుమతులను అందిస్తామని డిపో మేనేజర్ సుధారాణి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ బస్సులో ప్రయాణం ముగిసిన తర్వాత టికెట్ వెనక పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని, ప్రతి నెలా ఒకటో తేదీ, 16వ తేదీ లక్కీ డ్రా తీస్తామన్నారు. ఇందులో ఇద్దరి ప్రయాణికులకు బహుమతులను అందజేస్తామన్నారు.

మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ఉపాధ్యాయ వృత్తికి గుర్తింపు తెచ్చిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణ అని కేశవ రెడ్డి విద్యాసంస్థల అధినేత యన్. కేశవ రెడ్డి కొనియాడారు. బుధవారం పట్టణ శివారులోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఆయన పూలమాలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ వేడుకలలో నంద్యాల పట్టణంలోని టెక్కే, బాలాజీ కాంప్లెక్స్ నందు గల డే స్కూల్స్, పాణ్యం దగ్గర గల రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన దాదాపు 500 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

సరైన సమయంలో చికిత్స అందించాలి

ప్రజాశక్తి - పాణ్యం : సరైన సమయంలో రోగికి చికిత్స అందిస్తే జీవితం ఆనందంగా మారుతుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ రవిబాబు అన్నారు. శాంతిరాం వైద్యశాలలో బుధవారం బేతంచెర్లకు చెందిన పాలిష్ కట్టర్ సమీర్, జరీఫాలకు చెందిన 18 నెలల చిన్నారి అఫ్రామిన్నాకు అరుదైన వైద్యం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి బాబు మాట్లాడుతూ బాలికకు పుట్టు మూగ, చెవిటి కావడంతో పరీక్షించి శస్త్ర చికిత్స అందించామన్నారు. చిన్న వయసు కావడంతో ఆపరేషన్ కీలకంగా మారిందన్నారు. నాలుగేళ్లు దాటితే బాలికకు ఆపరేషన్ చేయడం ఇబ్బందిగా మారి జీవితాంతం మూగ, చెవిటితో బాధ పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా బాలికకు ఉచితంగా ఆపరేషన్ చేశామని తెలిపారు.

8న ముగింపు సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నంద్యాల : 'రాష్ట్రాన్ని రక్షించండి–దేశాన్ని కాపాడండి' నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త బస్సుజాత ఈ నెల 8వ తేదీ తిరుపతిలో జరుగుతున్న ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు కోరారు. బుధవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

8న చంద్రబాబు సమక్షంలో టిడిపిలోకి హైకోర్టు న్యాయవాది

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఈ నెల 8న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బనగానపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్నారు. ఆయన సమక్షంలో ఆయన సమక్షంలో ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు టిడిపిలో చేరనున్నారు. సిరివెళ్ల మండలం వీరారెడ్డి పల్లె గ్రామం నుంచి అభిమానులు, కార్యకర్తలతో పెద్ద సంఖ్యలో వాహనాల్లో బనగానపల్లికి తరలి వెళ్లనున్నారు. నంద్యాల జిల్లాలో ఎక్కువగా ఉన్న బలిజ కులస్తులకు టిడిపి తరపున ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరనున్నట్లు గోగిశెట్టి నరసింహారావు తెలిపారు. కాపు, బలిజ కులస్తులకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలని కోరుకుంటూ రాబోయే ఎన్నికల్లో గెలుపు దిశగా అడుగులు వేస్తామని గోగిశెట్టి తెలిపారు.

చంద్రబాబును కలిసిన గోగిశెట్టి (ఫైల్)

నేడు సంఘీభావ యాత్రను జయప్రదం చేయండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగింపునకు సంఘీభావంగా నేడు నంద్యాలలో చేపట్టే భారత్ జోడో సమ్మేళన పాదయాత్రను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జె.లక్ష్మి నరసింహ ఆ పార్టీ శ్రేణులకు, ప్రజలను కోరారు. బుధవారం నంద్యాలలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి మొసలి కన్నీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. గ్యాస్ ధర పెంపుతో రూ.8.33 లక్షల కోట్ల దోపిడీ చేసి ఎన్నికల ముందు పేదలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. దేశంలో త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గత పదేళ్లలో రెట్టింపు చేసిన గ్యాస్ బండ ధరపై హఠాత్తుగా రూ.200 తగ్గించడం కేవలం ఎన్నికల్లో లబ్ది పొందేందుకేనని తెలిపారు. ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్న దేశం లక్షల కోట్ల రూపాయిల అప్పుల్లో కూరుకుపోయిన దానిపై కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాది క్రితం రాహుల్ గాంధీ సెప్టెంబర్ 7న కన్యాకుమారి సముద్రపు తీరం నందు మొదలు పెట్టిన యాత్ర కాశ్మీర్‌లోని లాల్ చౌక్ దగ్గర ముగింపు చేశారన్నారు. వారి పాదయాత్రకు సంఘీభావంగా నేడు నంద్యాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ వరకు జరిగే భారత్ జోడో సమ్మేళన యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు నాగలింగం, నంద్యాల, పాణ్యం నియోజకవర్గాల కో ఆర్డినేషన్ సభ్యులు ఫరూక్, వడ్డే సాంబ శివుడు, జిల్లా కార్యదర్శి రహిమాన్, జిల్లా నాయకులు మానపాటి శ్రీనివాసులు గౌడ, స్వర్ణ సుప్రవీన, సురేంద్ర రెడ్డి, ఆదాం, మధు, ఆనందరావు, సలీం, రఫీ, శంసుల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి నరసింహ యాదవ్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిపిఐ

ప్రజాశక్తి - పగిడ్యాల

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ప్రాతకోట గ్రామంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో భవన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మికుల కోసం అనేక జీవోలు వచ్చినా ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని మండిపడ్డారు. ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మరణిస్తే రూ.5 లక్షలు, సాధారణంగా మరణిస్తే రూ.2 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు షాలుమియా, అబ్దుల్ రహీం, లక్ష్మీనారాయణ, వెంకటస్వామి, ముత్తుజావలి, మాభాష, ఖలీల్, మస్తాన్, షబ్బీర్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలం గొర్విమానిపల్లె గ్రామ సమీపంలో బుధవారం విద్యుత్ షాక్‌తో ఒకరు మతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గొర్విమానిపల్లె గ్రామ సమీపంలో గల లొక్కి గుండం గుడి వద్ద మట్టిని టి.రాజాశేఖర్ చదును చేయుటకు మట్టిని తోలే క్రమంలో కరెంట్ డిపి గల కరెంట్ స్థంబం నుండి చాలా కాలంగా గుడి బయట గల సత్రం, మర్రిచెట్టు వద్దకు కరెంట్ బల్బు కోసం లాగిన సన్నని కరెంట్ వైరు కిందకి వేలాడుతుంది. మట్టిని తోలే క్రమంలో ఆ వైరు ట్రాక్టర్‌కు తగులుతుందేమోనని టి.రాజశేఖర్ (27) సన్నని ఇనుప పైపు తీసుకొచ్చి వైరును ఒక వైపు కట్టి ట్రాక్టర్‌ను సైడుకు ఆపి ట్రాలీలో నిలబడి పక్కకి పైపును నిలుపుతుండగా ప్రమాదవశాత్తు మెయిన్ కరెంట్ వైరుకు తగిలి షాక్ కొట్టింది. దీంతో టి.రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని రక్షించడానికి ప్రయత్నం చేసిన కమ్మరి కిట్టయ్యను గాయాలయ్యాయి. గాయపడిన అతడిని అనంతపురంలోని సవేరా ఆస్పత్రికి తరలించారు. టి.రాజశేఖర్‌కు భార్య, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు.

బాత్రూంలో జారిపడి ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో కంకర గుర్రెడ్డి కాంప్లెక్స్‌లోని రూమ్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్ జి ఆదాం (48) బాత్రూంలో కాలు జారిపడి మృతి చెందినట్లు ఎస్సై రామిరెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు.. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన జి.ఆదాం బనగానపల్లెలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. పట్టణంలోని బీసీ కాలనీలో ఆదాం కుటుంబం నివాసముంటు న్నారు. అయితే ఆదాం పట్టణంలోని కంకర గుర్రెడ్డి కాంప్లెక్స్‌లో ప్రత్యేకంగా రూము తీసుకొని ఉంటున్నారు. రూమ్‌లో బాత్రూంకి వెళ్లి కాలు జారిపడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు భార్య శ్రావణి, ఇద్దరు కుమారులు భరత్, శరత్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శృతి మించిన వైసిపి ఆగడాలు : టిడిపి

ప్రజాశక్తి - పాణ్యం : పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో లోకేష్ యువగళం పాదయాత్రలో వైసిపి కార్యకర్తలు రాళ్లు, కర్రలతో దాడి చేయడం చాలా దారుణమని, వైసిపి ఆగడాలు శృతిమించాయని టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి లాయర్ బాబు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైసిపి అధికారంలోనికి రావడానికి ఒక అవకాశం ఇస్తే ఇంత దారుణాలు జరుగుతున్నాయని, మళ్లీ మళ్లీ అవకాశం ఇస్తే రాష్ట్రం ఏమవుతుందోనని, ప్రజలు ఆలోచించి రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మండలం శ్రీపతిరావు పేట గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సుద్దుల రచ్చబండ వద్ద శ్రీకృష్ణుని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. **నందికొట్కూరు టౌన్ :** సుబ్బారావు పేటలో ఆచార్య ప్రబోధానంద ఆశ్రమం ఆధ్వర్యంలో వాడాల వెంకటేశ్వర్లు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. వైసిపి నాయకులు విఆర్ శ్రీను, సచివాలయ కన్వీనర్ బాండ్ శ్రీను, వార్డు ఇంచార్జ్ చింతా శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ చింతా తులసమ్మ, మోహన్ రెడ్డి పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని భారతి విద్యా మందిరం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల అధ్యక్షులు టిఎంసి వేణుగోపాల్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణం లో విద్యార్థులు ఉట్టి కొట్టారు. ఉపాధ్యక్షులు రామ లింగేశ్వర, రామలింగారెడ్డి, పిఆర్ఎస్ ప్రసాద్, రాధా కృష్ణమూర్తి, శ్రీనివాస్, పాఠశాల ప్రధానాచార్యులు సావిత్రమ్మ, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు. **అలాగే** గీతా మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీకృష్ణుని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. **ప్యాపిలి :** శ్రీ సరస్వతీ శిశు విద్యా మందిరం స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా అధ్యక్షుడు అనిమిరెడ్డి, సెక్రటరీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు వాసు, పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** చింతలాయపల్లె గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గొర్రెల పెంపకదారుల సంఘం డైరెక్టర్ బి జయరాముడు యాదవ్, తోకల శివకృష్ణ యాదవ్, పుల్లయ్య యాదవ్ పాల్గొన్నారు. **కొత్తపల్లి :** మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఉట్టి కార్యక్రమం నిర్వహించి శ్రీకృష్ణుని ఊరేగింపు చేశారు. యాదవ సంఘం నాయకులు ఆస్పాటి రాజు రాఘవేంద్ర రవి రామసుబ్బయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీ అక్షర స్కూల్‌లో..

డోన్ : డోన్ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న శ్రీ అక్షర స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి.రామకృష్ణ కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బండ్ల రామాంజనేయులు, బండ్ల

ఆళ్లగడ్డ : ఉట్టి కొడుతున్న చిన్నారులు

పూజలు చేస్తున్న గొర్రెల పెంపక దారుల సంఘం జిల్లా డైరెక్టర్ బి జయ రాముడు

ఎస్‌డిఆర్ పాఠశాలలో వేడుకలు..

నంద్యాల కలెక్టరేట్ : నంద్యాలలోని ఎస్‌డిఆర్ పాఠశాల ప్రాంగణంలో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగినాయి. బాల బాలికలు శ్రీ కృష్ణ, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల చైర్మన్ కొండా రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేవకీ వసుదేవులకు ఎనిమిదో బిడ్డగా బహుళ పక్షం అష్టమి రోజున శ్రీ కృష్ణుడి జననం గురించి వివరించారు. పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ శ్రీ కృష్ణుడి జననం వివరించారు. చివరగా ఉట్టి కొట్టి ఆనందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతముగా నిర్వహించిన ఉపాధ్యాయులకు పాఠశాల చైర్మన్ కొండారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చిన్నారి కృష్ణులు, గోపికలతో పాఠశాల చైర్మన్ కొండారెడ్డి

బాల అకాడమీ పాఠశాలలో..

నంద్యాల : నంద్యాల పట్టణంలోని బాల అకాడమీ రవీంద్ర హైస్కూల్‌లో శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, బలరాముడు, గోపికల వేషధారణలతో అందరినీ అబ్బురపరిచారు. ఈ వేడుకలలో పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీ లత, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయడం యెమనగా నాక్లయింట్ సుభమ్ హౌసింగ్ డెవలప్ మెంట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, నంద్యాల శాఖ వారి తరుపున తెలియజేయడం యెమనగా, ఎస్. కరీముల్లా, W/o.హుస్సేన్ భాష, నివాసం ఇంటి నెంబరు: 2-67, కానాల గ్రామము, నంద్యాల మండలం, నంద్యాల జిల్లా అనే వారు నా క్లయింట్ బ్యాంక్‌ను లోనుకొరకు సంప్రదించినారు. సదరు లోనుకు సంబంధించి ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెంబర్ 3244/2014, తేదీ 19-06-2014 గల డాక్యుమెంట్ పోయినది అని తెలిపినారు. సదరు డాక్యుమెంట్ క్రింద షెడ్యూల్ కు సంభందించినది. కావున ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం యెమనగా పైనా పేర్కొన్న ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ కు సంబంధించి ఎవ్వరికైనా హక్కులు, అధికారాలు, తాకట్లు ఉన్నయెడల ఈ తేది నుండి వారం రోజుల లోపుల నాకు తగిన ఆధారములతో మీ అభ్యంతరములు తెలుపుకోనగలరు, లేనిచో యెలాంటి అభ్యంతరములు లేవని ఎస్.కరీముల్లా గారికి లొను మంజురు చేయబడునని తెలియజేయడమైనది.

షెడ్యూలు :

హౌస్ సైట్ ఆస్తి కానాల గ్రామము, నంద్యాల మండలం, నంద్యాల జిల్లా, నంద్యాల సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లా, నంద్యాల జిల్లా కింది వివరాలను కలిగి ఉంది.
సర్వే నెంబర్ 809/1 పైకి, విస్తీర్ణం: ఏ.0-01 సెంటు 500 లింకులు లేక 72.6 చదరపు గజాలు.

దిక్కులు :
తూర్పు : షేక్ హుశేన్ గారి బైలు
పడమర : మాసుల్ దార్ షబ్బీర్ గారి బైలు
ఉత్తరం : బిజనవేముల శివారెడ్డి గారి బైలు
దక్షిణం : రస్తా

తాతిరెడ్డి లక్ష్మీ వసంతం రెడ్డి,
అడ్వొకేట్,
Room No:2, S.R.S.C COMPLEX,
Beside: Court Complex,
Nandyal town & district
Cell No.9493134081.